భూముల వేలం రద్దు చేయాలి

- బీఆర్ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

గద్వాల, ఏప్రిల్ 1: ఇది ఇందిరమ్మ రాజ్యం కాదని కాంగ్రెస్ కబ్జాదారుల రాజ్యమని బీఆర్ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆరోపించారు. మంగళవారం స్థానిక పీజీ కేంద్రంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా ఆయన ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించి నాలుగు వందల ఎకరాల భూమిని లాక్కొనే ప్రయత్నం చేస్తుందని, దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ ప్రఖ్యాత కలిగిన సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయడాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యమంటే విశ్వవిద్యాల యాల భూములు అమ్మడమా అని ప్రశ్నించారు. సెంట్రల్ యూనివర్సిటీ మీద కనీస అవగాహన లేని వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు రాజశేఖర్, మాధవ్, మహేశ్, ప్రకాశ్, పవన్, రాజు, చక్రవర్తి, ధనరాజ్, నరేంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు.

భూముల విషయంలో ఆలోచించాలి

మల్దకల్, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నాలుగు ఎకరాలు భూములు పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపై ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన అణిచివేత చర్య అని జిల్లా యువ నాయకులు బండారి రాజు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కాలక్రమంలో అనేక పేరు ప్రఖ్యాతలు సాధించుకున్నదన్నారు. ఈ యూనివర్సిటీ దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థలో ఒకటిగా నిలిచిందన్నారు. ఇటువంటి భూములను ప్రభుత్వం రాజకీయం చేస్తు బుల్డోజర్లు యంత్రాలను పెట్టి వేగంగా కబ్జా చేసే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరించారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

వనపర్తి టౌన్, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంపాటను విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ మాట్లాడుతూ.. నిరసన కార్యక్రమానికి జిల్లా నుంచి తరలివెళ్తున్న సీపీఎం నాయకత్వాన్ని ముందస్తుగా అరెస్టులు చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు, ప్రజా స్వామ్యవాదులు వ్యతిరేకించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద, నాయకుల మీద నిర్బంధం పెరిగిందని వారు విమర్శించారు. తమ ప్రభుత్వ మనుగడకోసం ప్రభుత్వ భూములను అమ్ముకోవడం సరికాదన్నారు. నాలుగు వందల ఎకరాల హెచ్‌సీయూ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విమరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.రాజు, బాల్ రెడ్డి, కురుమయ్య, మదన్, గట్టయ్య, బాలరాజు, రాములు, భీసన్న, కురుమయ్య, పుల్లయ్య, బాలపీరు, బాలరాజు, కమలాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం బీఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ హేమంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రజా పాలన పేరుతో హెచ్‌సీయూ క్యాంపస్‌లోని నాలుగు వందల ఎకరాల స్థలాన్ని బుల్డోజర్లతో మట్టికరిస్తున్నారని విమర్శించారు. తప్పు అని ప్రశ్నిస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు బనాయిస్తూ గోస పెడుతున్నారన్నారు. దీనిని విద్యార్థుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కావలి భానుప్రకాశ్, శిశయాదవ్, కార్తీక్, సురేశ్, మోహన్‌యాదవ్, ప్రేమ్‌కుమార్, నవీన్‌కుమార్, యుగంధర్‌రెడ్డి, శేఖర్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, రామ స్వామి, విజయ్, మహేశ్ ఉన్నారు.

వనపర్తి రాజీవ్ చౌరస్తాలో నిరసన చేపడుతున్న సీపీఎం నేతలు

హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలి

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 1: తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని పరిరక్షించేందుకు విద్యార్థులు చేస్తున్న పోరాటానికి సహకరించాల్సిన పోలీస్ యంత్రాంగం విద్యావ్యవస్థపై దాడి చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. సీఐటీయూ నాయకులను మంగళవారం ఎలాంటి సమాచారం లేకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అనైతికమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజానీకానికి ఉందన్నారు. ప్రభుత్వ చర్యలు నిరసిస్తూ విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు నడుం బిగించాలన్నారు.

అక్రమ అరెస్టులో ఉద్యమాలను అపలేరు

అమరచింత, ఏప్రిల్ 1: ప్రజల ఆస్తులను అధికార మదంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్పనంగా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుంటే ఆందోళన చేస్తున్న హెచ్‌సీయూ విద్యార్థుల అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అపలేరని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అజయ్, రమేశ్, డీవైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రఘు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సంబంధించిన నాలుగు వందల ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు లీజ్‌కు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. విద్యార్థుల అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టేందుకు మద్దతుగా హైదరాబాద్‌కు బయలుదేరిన నాయకులను ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తుగా మంగళవారం ఉదయం అరెస్టు చేసి సొంత పూచికత్తుపై విడుదల చేయగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు..

అమరచింతలో సీపీఎం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

అలంపూర్‌లో నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

మాట్లాడుతున్న బండారి రాజు

లబ్ధిదారులందరికీ సన్నబియ్యం పంపిణీ

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 1: జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 2 నుంచి తెల్ల రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ చౌకధర దుకాణాల ద్వారా ఉచిత సన్నరకం బియ్యం సరఫరా చేయనున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం జిల్లా లోని ఆయా నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యులు చౌకధర దుకాణాల్లో సన్న రకం బియ్యం పంపిణీని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 1, 59, 353 తెల్ల రేషన్‌కార్డులు ఉండగా 5, 22,367 మంది లబ్ధిదారులు ఉన్నారని, గణంకాలు వెల్లడించారు. రేషన్‌కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యుడికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్న రకం బియ్యం ఉచితంగా ఇవ్వనున్నారని, దీని కోసం జిల్లాలో 3309 మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యం అవసరం ఉంటుందని, జిల్లాలోని 324 చౌకధర దుకాణాల్లో సన్న బియ్యం ఉచితంగా పంపిణీని నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో సన్నరకం బియ్యం పంపిణీ చేసేందుకు అవసరమైన ధాన్యం నిల్వలు ఉన్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

బాధితుల సమస్యలపై చొరవ చూపాలి

మాట్లాడుతున్న ఎస్పీ తోట శ్రీనివాసరావు

- ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 1 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని పోలీస్ అధికారులను ఎస్పీ తోట శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాల తోపాటు రికార్డులు, సిబ్బంది విధులు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలగాలని, ఫిర్యాదులను తక్షణమే విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ముందస్తు సమాచారం అందించాలన్నారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని, ఎలాంటి నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను తదితరులున్నారు.

తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే చర్యలు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 1 : గతంలో జరిగిన వివాదాలు పరిష్కారమై ప్రశాంతంగా ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన వీడియోలను మళ్లీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తప్పుడు సమాచారం చేరవేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీను మంగళవారం ప్రకటనలో హెచ్చరించారు. మూడేండ్ల కిందట కేటీదొడ్డి మండలం ఇర్కిచేడులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో వివాదాలు జరుగగా, ఆ సమయంలో గ్రామ పెద్దలు, రెవెన్యూ, పోలీస్ అధికారులు మాట్లాడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నదన్నారు. కానీ పాత వీడియోలను మళ్లీ కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేసి అవాస్తవాలను సృష్టించడం చట్టరీత్యా నేరమని, బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

క్రీడలను ప్రారంభిస్తున్న పొగాకు విశ్వేశ్వర్

కొత్త కోట, ఏప్రిల్ 1: మున్సిపాలిటీ కేంద్రంలో ఈద్గా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాల రంజాన్ ట్రోఫీని మంగళవారం మాజీ జెడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ రంజాన్ ట్రోఫీ మూడురోజుల పాటు కొనసాగుతుందని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 22 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు పాల మూరు జట్టు, కొత్తకోట సన్ డైర్స్ జట్లు తలపడ్డాయి. ఇందులో పాలమూరు జట్టు విజయం సాధించిందన్నారు. అనంతరం పొగాకు విశ్వేశ్వర్ మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరం కావడానికి ఈ క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో ఖాజా మైనోద్దిన్, వసీమ్ ఖాన్, వహీద్, తాహెర్ బాబా, సయ్యద్ లాలూ, డాక్టర్ సాజిద్ అలీ, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో చేతివాటం

గద్వాల అర్బన్, ఏప్రిల్ 1: హుండీ లెక్కింపు వ్యవహారంలో ఓ వ్యక్తి చేతివాటం ప్రదర్శించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి. గత శుక్రవారం జిల్లా కేంద్రంలోని జములమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ లెక్కింపు సమయంలో ఓ వ్యక్తి దాదాపు లక్ష రూపాయలు పక్కకు వేసినట్లు ఆరోపణలు వినబడ్డాయి. ఈ వ్యవహారం ఆలయ కమిటీ సభ్యులకు తెలియడంతో ఈ వ్యవహారాన్ని బయటకు పోకుండా జాగ్రత్తలు చేపట్టి రహస్యంగా చక్కదిద్దే ప్రయత్నాలు పూనుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో హుండీ లెక్కింపు సమయంలో కాజేసిన నగదును మంగళవారం తిరిగి హుండీలో వేసినట్లు తెలియడంతో విషయం బయటకు పొక్కింది. అయితే ఈ వ్యవహారం ఇప్పుడే జరిగిందా.. లేక ప్రతి సారి హుండీ లెక్కింపు చేపట్టిన సమయంలో కూడా చేతివాటం ప్రదర్శించారా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో ఆలయ కమిటీ సభ్యుల హస్తం ఉందా.. అధికారుల హస్తం ఉందా.. అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గత కొంత కాలంగా ఆలయంలో అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటి బయటకు రావడంతో ఆలయంలో ఎంత అవినీతి జరిగిందో అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి వివరాలను ఆలయ ఈవోను వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా.. ఫోన్‌లు స్విచాఫ్ చేయడంతో అందు బాటులోకి రాలేదు.

దరఖాస్తుకు గడువు పెంపు

వడ్డేపల్లి, ఏప్రిల్ 1: రాజీవ్ యువ వికాసం పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల నుంచి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు గడువు ఏప్రిల్ 14వరకు పొడిగించినట్లు ఎంపీడీవో రామకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో చేసుకోవచ్చును, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భార్యాభర్తలపై దాడి కేసునమోదు

వడ్డేపల్లి, ఏప్రిల్ 1: మండలంలోని తిమ్మాజిపల్లెలో సోమవారం రాత్రి రాముడు అతడి భార్య మాధవి వారి ఇంట్లో ఉండగా గ్రామానికి చెందిన గోపాల్ దౌర్జన్యంగా ఇంట్లో చొరబడి వారిపై దాడి చేశాడని ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు. దాడి చేసి భార్యాభర్తలను కొట్టాడని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఉచిత కంటి పరీక్షలు

అమరచింత, ఏప్రిల్ 1: ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖాన ఆవరణలో మంగళవారం కందూర్ రాంరెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి 26మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు హెల్త్ సూపర్ వైజర్ సురేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 26 మందికి వైద్యులు చికిత్సలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో రాంరెడ్డి ఆసుపత్రి వైద్యులు, ఆయా మండలాల ఏఎన్ యంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

మల్దకల్, ఏప్రిల్ 1: మండలంలోని ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం ఎడ్లబండి గిరక పోటీలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని 20 ఎడ్లజతలు పాల్గొన్నాయి. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను తిలకించడానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

విజేతలకు నగదు అందజేస్తున్న దాతలు

దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలి

చిన్నారులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాసులు

- డీఎంహెచ్‌వో శ్రీనివాసులు

పెబ్బేరు, ఏప్రిల్ 1: ప్రభుత్వ దవఖానాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మంగళవారం ఉదయం వరకు దవఖానాల్లో ఆరు సాధారణ ప్రసవాలు జరిగినేపథ్యంలో ఆయన వైద్య బృందాన్ని అభినందించారు. బాలింతలను, చంటి బిడ్డలను ఆయన పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. పేదలకోసం ప్రభుత్వం ఎన్నో వైద్య సేవలందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు ప్రవీణ, సిబ్బంది చరిత, లీలమ్మ, స్వరూపరాణి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 1: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని బార్ అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో తెలంగాణ బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బార్ కౌన్సిల్ మెంబర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కొండా రెడ్డి, సునిల్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని, ప్రభుత్వంతో మాట్లాడి.. న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు, న్యాయవాదులకు అకాడమీ మేరకు శిక్షణ, అవగాహన నిర్వహించేలా చూడాలని చెప్పారు.

మాట్లాడుతున్న రాష్ట్ర బార్ అసోసియేషన్ నాయకులు

ప్రమాణస్వీకారం చేసిన కార్యవర్గం..

బార్ అసోసియేషన్ కార్యవర్గం జిల్లా కోర్టులో ప్రమాణస్వీకారోత్సవం చేశారు. అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా శ్యాం, కోశాధికారిగా రాజు, జాయింట్ సెక్రటరీగా పి.శంకర్, కోర్టు ఇన్‌చార్జిగా రాంధూళి, లేబర్ కార్యదర్శిగా యాదగిరి, మహిళా ప్రతినిధిగా కల్యాణి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా శ్రీనివాసులు, ఎండీ నిరంజన్ బాబా, ఎన్.రాజు, భరత్‌కుమార్, నరేందర్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోపాల్ రెడ్డి, విజయ్‌సాయి, చంద్రశేఖర్, భరత్, పురుషోత్తం, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య పరాశ్రీకి ఆహ్వానం

ధరూరు, ఏప్రిల్ 1: ఈ నెల 6న జరిగే శ్రీరామనవమి వేడుకలకు ఆదిత్య పరాశ్రీకి మండలంలోని నీలహళ్లి గ్రామస్తులు మంగళవారం బిజ్వార్ మండలానికి వెళ్లి అధ్యాత్మిక చింతనను పంచాలని ఆహ్వాన పత్రికను అందించారు. అనంతరం శాలువాతో గురువుకు సన్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు హన్మంతు, రామాంజనేయులు, ఉరుకుందు, జగన్, రాము, జంగిలప్ప, రేలంగి, ఉదయ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

పాన్‌గల్, ఏప్రిల్ 1: మండలంలోని కేతేపల్లికి చెందిన సుజాత, మామిళ్లపల్లి మణెమ్మకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం నాయకులు విష్ణు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుజాత వెన్నుముక ఆపరేషన్ నిమిత్తం శస్త్ర చికిత్స చేయించుకోగా సీఎం సహాయనిధికోసం దరఖాస్తు చేసుకున్నదని తెలిపారు. దీంతో సుజాతకు రూ.39వేలు, అదేవిధంగా మణెమ్మ కాలు శస్త్ర చికిత్స నిమిత్తం రూ.30 వేలు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, చిన్నఎల్లయ్య, బీరయ్య పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

వనపర్తి టౌన్, ఏప్రిల్ 1 : పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లైయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, గ్రూప్-డీ పోటీ పరీక్షలకు నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3 నుంచి 4నెలల పాటు ఉచిత భోజన వసతితో కూడిన మెరుగైన శిక్షణను హైదరాబాద్‌లోని శ్రీధర్ సీసీఈ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉచిత శిక్షణ పొందడానికి ఏప్రిల్ 5వ తేదీన రెండు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వివిధ సెంటర్లలో అర్హత పరీక్ష నిర్వహిస్తారని, ఇందులో భాగంగా తెలంగాణలోని వనపర్తి, హైదరాబాద్, అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ పరీక్ష కేంద్రాల్లో అర్హత పరీక్ష 100 మార్కులకు గానూ 90ని మిషాలు కేటాయించబడుతుందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 3లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9542433427 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 1 : పేట మండల పరిధిలోని జిలాల్‌పూర్ గ్రామ బస్టాండ్ వద్ద కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, పేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకొన్నారు. జిలాల్ పుల్‌కు చెందిన హన్మంతు వివిధ గ్రామాల నుంచి సేకరించిన బియ్యం అక్రమంగా కర్ణాటకకు తరలిస్తుంటే పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. డీటీ కాశప్ప పంచనామా అనంతరం హన్మంతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

తల్లి మందలించిందని తనయుడు ఆత్మహత్య

బాలానగర్, ఏప్రిల్ 1 : తల్లి మందలించిందని ఓ తనయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాలానగర్ ఎస్సై లెనిన్ కథనం ప్రకారం ఫరూఖ్‌నగర్ మండలం చింతగుణ్ణెం గ్రామానికి చెందిన వడ్డె రఘువర్ధన్(19) మార్చి 29న బాలానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని జింపెక్స్ పరిశ్రమలో పని చేస్తున్న రఘువర్ధన్ ఇటీవల గ్రామంలోని ఓ మహిళతో తిరుగుతుండడం గమనించిన తల్లి యాదమ్మ మార్చి 27న ఇది సరైన పద్ధతి కాదని, మహిళతో తిరగడం మానేయమని మందలించింది. దీంతో తల్లిపై అలిగిన రఘువర్ధన్ బాలానగర్ నుంచి చింతగూడెం వెళ్లే దారిలో పురుగుల మందుతాగి అస్వస్థతకు గురై తన మేనమామ వెంకటేశ్‌కు ఫోన్‌చేసి పురుగుమందు తాగిన విషయం చెప్పాడు. శంషాబాద్‌లోని దవాఖాన తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మంగళవారం మృతుని తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి..

జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు

గద్వాల/ రూరల్, ఏప్రిల్ 1: పాస్టర్ ప్రవీణ్ అనుమానస్పద మృతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిజాలు నిగ్గుతేల్చి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో క్రైస్తవసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు మాట్లాడారు.. పాస్టర్ ప్రవీణ్ క్రైస్తవ సభలకు విజయవాడ నుంచి రాజమండ్రికి వెళ్తున్న సమయంలో రాజమండ్రిలో 24న రాత్రి సమయంలో హత్యచేసి రోడ్డు పక్కన మృతదేహాన్ని పడి వేయడం బాధాకరమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై యాక్సిడెంట్ అయినట్టు కన్పించడం లేదన్నారు. కొంతమంది దుండగులు కావాలనే ప్రవీణ్‌ను పథకం ప్రకారం ప్రయాణిస్తున్న సమయంలో హత్య చేసి రోడ్డు పక్కన పడేసి వెళ్లారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు ఆరోపించారు. హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వీరికి ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అర్జెంటుగా కావలెను
★అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి సౌకర్యం కలదు. మంచి జీతం కలదు. సంప్రదించండి: 9392663777, 9246663777.
NT-329238

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకో